తెలంగాణ
ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ గురువారం 19 - 03 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 5

# మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ చేయూత



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన శ్రీ రామోజు సత్యనారాయణచారి పాత పోస్టాఫీస్ వద్ద కిరాయికి ఉంటున్న ఇంట్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరగడంతో వారు నిరాశ్రయులయ్యారు. దీంతో స్పందించిన మన మోత్కూర్ వాట్సప్ గ్రూప్ సభ్యులు, దాతలు రూ.8 వేలు సేకరించగా బుధవారం బాధితుని కుటుంబానికి కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మొగుల్లపల్లి సోమయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, మొరిగాల శ్రీనివాస్, కోమటి జనార్దన్, శ్రీరామోజు శివ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగ పంపిణీ



ప్రజావారధి/శాలిగౌరారం

శాలిగౌరారం మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చైత్ర ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ బుడిగె శ్రీనివాసులు, క్లబ్ డీసీ మెంబర్ డెంకల సత్యనారాయణ, ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి దామెర్ల శ్రీనివాస్, సభ్యులు గుండ్ల రామూర్తి, బట్ట చినసైదులు తదితరులు పాల్గొన్నారు.

# నిరాహార దీక్షను విజయవంతం చేయాలి



ప్రజావారధి/మోత్కూరు

ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరెళ్ల రమేష్ కోరారు. బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న నిరాహార దీక్షలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంపాక రాములు, మండల ఇన్‌చార్జి కూరెళ్ల సైదులు, మండల అధ్యక్షుడు బందెల శ్రీను, యువసేన మండల అధ్యక్షుడు పల్లె నవీన్, మోత్కూర్ పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల చిన్న, కూరెళ్ల సందీప్, రుద్రవెల్లి గణేష్, కల్లెం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది వేడుకలను ఆనందంగా జరుపుకోవాలి





## ▫ మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య

**ప్రజావారధి/మోత్కూరు**
ఉగాది పండుగను ప్రజలు ఆనందంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య కోరారు. మోత్కూరు మున్సిపాలిటీలో ఉగాది వేడుకల కోసం ముత్యాలమ్మ ఆలయాల వద్ద బుధవారం ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయాల పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోత్కూరులో జరిగే ఉగాది వేడుకలను ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఇక్కడ జరిగే వేడుకలు మరెక్కడా జరగవన్నారు. మన ఆచార, సంప్రదాయాలను కాపాడుతూ ఇక్కడి చరిత్రను చాటిచెప్పడం మన అదృష్టంగా భావించాలని, మన సంస్కృతి, సంప్రదాయాలను, ఆధ్యాత్మికతను ప్రతిబింబించే గొప్ప పండుగ ఉగాది అన్నారు. ముత్మాలమ్మలకు మహిళలు బోనాలు సమర్పించే సమయంలో ఎడ్ల బండ్లు, వాహనాల ప్రదర్శన సందర్భంగా యువత సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో వేడుకలను జరుపుకోవాలని కోరారు. ముత్మాలమ్మ చల్లనిచూపు, ఆశీర్వాదం ప్రజలందరిపై ఉంటుందన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్, మేనేజర్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు గడ్డం సోమనర్సయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### భాష అర్థం కావడం లేదనే భావనతోనే..

# ఎమ్మెల్యే సామేల్ వ్యాఖ్యలు



## టీపీసీసీ నాయకులు, అడ్వొకేట్ పర్రెపాటి యుగంధర్

**ప్రజావారధి/మోత్కూరు**

బ్రాహ్మణులు చదువుతున్న వేదమంత్రాలు సామాన్య ప్రజలకు సరళమైన భాష లో అర్థం కావడం లేదని భావనతోనే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యాఖ్యలు చేశారని, వారిని ఏమాత్రం కించపర్చాలన్న ఉద్దేశం లేదని టీపీపీసీ నాయకులు, అడ్వకేట్ పర్రెపాటి యుగంధర్ అన్నారు.  ఒక పార్టీ ఒక మనిషి ఒక వాదంపై మరో ఆలోచన కలిగిన మనిషి తనదైన శైలిలో విమర్శించడం అనేది సర్వసాధారణమైన విషయమని, భారతదేశంలో ఆర్టికల్ 19 (1)(ఋ)),19(2) ప్రకారం రాజ్యాంగం వాక్ స్వాతంత్ర్యపు హక్కు కల్పించిందన్నారు. ఎమ్మెల్యే సామేల్ వ్యాఖ్యలను తప్పుదారి పట్టించిన బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొట్టాలన్న కుట్రకు పూనుకుందని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కు ఇతర రాజకీయ పక్షాలకు లేకుండా చేయాలనే బీజేపీ కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. ఎమ్మెల్యే సామేల్ బ్రాహ్మణులు చదువుతున్న భాషా అర్థం కావడం లేదు అనే భావనను వ్యక్త పరచడంలో జరిగిన వ్యక్తీకరణే తప్ప ఎవరిని ఉద్దేశించింది కాదన్నారు. తాను చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సామేల్  బ్రాహ్మణ వర్గాల పెద్దలకు వివరణతో క్షమాపణలు చెప్పినా కూడా బీజేపీ వర్గాలు సామెల్ ఇంటిపై దాడులకు దిగడం రాజ్యాంగ వ్యతిరేకమని, బ్రాహ్మణ మేధావులు ఆలోచించాలని కోరారు. బీజేపీ రాజకీయ ప్రయోజనాలకే వాడుకుంటుందే తప్ప ఆ వర్గాలపై ఎలాంటి ప్రేమ లేదన్నారు. సామేల్ చెప్పిన క్షమాపణ లపై ఆలోచన చేసి బ్రాహ్మణులు పెద్దన్న పాత్ర పోషించి వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
19 - 03 - 2026

ప్రభుత్వాలు, పాలకులు మారినా..

# పరిష్కారం కాని ప్రజా సమస్యలు



- రెండున్నరేళ్లు గడుస్తున్నా అమలు కాని కాంగ్రెస్ హామీలు
- మండలంలో దీర్ఘకాలిక ప్రజా సమస్యలను పరిష్కరించాలి
- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మోత్కూరు మండలంలో నెలకొన్న దీర్ఘకాలిక ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఎన్నికల సమయంలో మాత్రమే హామీలిచ్చి అమలు చేయడంలో విఫలమవుతున్నారని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు విమర్శించారు. మోత్కూర్ మండలం పాలడుగు గ్రామశాఖ సమావేశం బుధవారం వెండి యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రోడ్లు, సాగునీటి కాల్వలు, విద్య, వైద్యం ఇలా అన్నిరంగాల్లో అభివృద్ధి వెనుకబడి ఉందన్నారు. ఆర్టీసీ డిపో, 30 పడకల ఆస్పత్రి, పోస్ట్‌మార్టం సౌకర్యం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, రెవిన్యూ డివిజన్, సివిల్ కోర్ట్, గురుకులాలకు సొంత భవనాలు, గుండాల-మోత్కూర్ మధ్య బిక్కేరు వాగుపై నూతన బిడ్జి నిర్మాణం జరగడం లేదన్నారు. గత ఎన్నికల ముందు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లు గడుస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. బునాదిగాని కాల్వ పనులు పూర్తి చేస్తామని, రూ.261 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించి ఏడాది దాటిన ఇప్పటి వరకు ఎలాంటి పనులు ప్రారంభించలేదని, అసంపూర్తిగా ఉన్న కాల్వతో సాగు నీరు అందక మోత్కూర్, అడ్డగూడూర్ మండలాల్లో రైతుల బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటి పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వపనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. మండలంలో సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, గ్రామశాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, సహాయ కార్యదర్శి కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, దడిపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.


మోత్కూరు పట్టణ ప్రజలకు
ఉగాది మరియు రంజాన్ పండుగల
శుభాకాంక్షలు
శ్రీమతి గడ్డం స్వప్న సోమనర్సయ్య గారు
మోత్కూర్ మున్సిపల్ చైర్‌పర్సన్